క్లుప్తంగా

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాదుస్తులతో క్రీడాకారులు

గుడ్లూరు: నేషనల్ బాల్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు వెళుతున్న క్రీడాకారులకు మండలంలోని చేవూరు రామదూత ఆశ్రమ నిర్వాహకులు హనుమంతరావు చౌదరి మంగళవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోచ్ మురళి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మంచిర్యాలలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొనే జట్లకు 10 రోజుల పాటు శిక్షణ ఇచ్చామన్నారు. జాతీయ క్రీడాకారుడు గణేష్, బ్యాంకు శ్రీనివాసులు, కోచ్ మల్లికా శ్రీనివాసులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

హనుమంతునిపాడు: మండలంలోని కూడాగుండ్ల, హనుమంతునిపాడు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ జి.పెద్దిరాజు మంగళవారం పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. భోజనం రుచిగా ఉండేటట్లు చూసుకోవాలని కుకింగ్ ఏజెన్సీలకు సూచించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కాంప్లెక్స్ చైర్మన్ జీవీ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

గుడ్లూరు: మండలంలోని చెమిడిదిపాడులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ వినయ్ మంగళవారం తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో కూలీల మస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలంతా ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు ఇచ్చిన కొలతలు ప్రకారం పనిచేస్తే కూలి రూ.250 వస్తుందని తెలిపారు. పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఫీల్డు అసిస్టెంట్‌కు సూచించారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశంలోనే ఉండి పర్యవేక్షణ చేయాలన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

కందుకూరు అర్బన్: శివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కందుకూరు డిపో మేనేజర్ పెద్దన్న శెట్టి తెలిపారు. కందుకూరు నుంచి లింగసముద్రం మండలం మొగిలిచర్లకు 25 బస్సులు, పొన్నలూరు మండలం సంగమేశ్వరానికి 5 బస్సులు, టంగుటూరు నుంచి నర్సింగోలుకు 2 బస్సులు, ఉలవపాడు మండలం మన్నేటికోటకు బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. అదే విధంగా ఈ నెల 17వ తేదీ సాయంత్రం పంచభూత శివలింగాల దర్శనార్థం చిదంబరం, జంబుకేశ్వరం, అరుణాచలం, కంచి, శ్రీకాళహస్తికి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు కందుకూరు నుంచి తిరుపతికి ఉదయం, సాయంత్రం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడాలని డిపో మేనేజర్ కోరారు.

సీఎస్‌పురం: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భైరవకోన, నారాయణస్వామి ఆలయాల వద్దకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన మేర బస్‌లు నడపనున్నట్లు కనిగిరి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ సుందర్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ రవణమ్మ తెలిపారు. నారాయణస్వామి, భైరవకోన ఆలయాల ఈఓ నర్రా నారాయణరెడ్డి, ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, సిద్దు రమణారెడ్డిల విజ్ఞప్తి మేరకు కనిగిరి ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ మేనేజర్ సుందరరావు, అసిస్టెంట్ మేనేజర్ రవణమ్మ మంగళవారం ప్రముఖ పుణ్యక్షేత్రాలైన భైరవకోన, నారాయణస్వామి ఆలయాలను పరిశీలించారు. ఆయా ఆలయాల ప్రాంతంలో బస్టాండ్లను, ఏర్పాటు ను పరిశీలించారు. ఎన్ని బస్‌లు అవసరమవుతాయనే దాని గురించి ఈఓ నారాయణరెడ్డి, ట్రస్టుబోర్డు చైర్మన్ జయరెడ్డి, రమణారెడ్డిలతో సమీక్షించారు. కనిగిరి నుంచి భైరవకోన ఆలయానికి 23 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఉద్యానవన శాఖ అధికారి డి.ప్రత్యూష పేర్కొన్నారు. జరుగుమల్లి, కె.బిట్రగుంటలో మంగళవారం తోటబడి కార్యక్రమం నిర్వహించారు. మామిడి రైతులతో ఆమె మాట్లాడుతూ.. పూత దశ నుంచి పిందె దశ వరకు సకాలంలో మందులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. మామిడి చెట్లకు పూత బాగా వచ్చినప్పటికీ పిందెకట్టు సరిగా లేనప్పుడు బోరాక్స్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి వాడాలన్నారు. వీహెచ్‌ఏలు వంశీ, శ్రీను, రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం


గుడ్లూరులో మానవహారం ఏర్పడి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది


పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీఓ, డాక్టర్లు


మాట్లాడుతున్న డాక్టర్ ప్రియార్శానంద


పొన్నలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది


టంగుటూరులో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు

గుడ్లూరు: ప్రతి రోజు యోగా చేయడం, సైకిల్ తొక్కడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరి చేరవని వైద్యాధికారులు మారుతీరావు, సాయి ప్రియాంక అన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్, యోగా కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గుడ్లూరులో బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు మాట్లాడుతూ యోగాతో పాటు సైకిల్ తొక్కడం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఎస్సై రాములు, సీహెచ్‌ఓ భాస్కరరావు, జెడ్పీహెచ్‌ఎస్ పీడీ జీవన్‌కుమార్, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు కాపులూరి వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పామూరు: క్యాన్సర్ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని బొట్లగూడూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ హరిబాబు, డాక్టర్ విజయ్‌కుమార్ల అధ్యక్షతన పామూరులోని సచివాలయాల పరిధిలో క్యాన్సర్‌పై అవగాహన, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ఆరోగ్య నిమిత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. నిత్యం వ్యాయామం చేస్తూ బీపీ, సుగర్ ఒత్తిడిని అధిగమించి శారీరకంగా ఉల్లాసంగా ఉండాలన్నారు. అనంతరం ప్రధాన వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ మురళి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మణిదీపిక అన్నారు. మండలంలోని కొండసముద్రం సచివాలయ పరిధిలో పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం వలేటివారిపాలెం ప్రభుత్వ అసుపత్రి నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. సీహెచ్‌ఓ శివరామయ్య, పీహెచ్‌ఎన్ నవమణి, హెచ్‌ఎస్ బాలరాజు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: మహిళలు క్యాన్సర్ వ్యాధిన బారిన పడకుండా రోజు కొంత సమయం సైక్లింగ్ చేయడం వల్ల నివారించవచ్చని డాక్టర్ ప్రియార్శానంద అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం సైక్లింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియార్శానంద మాట్లాడుతూ సైక్లింగ్ వల్ల శరీర బరువు నియంత్రించుకోవచ్చని, మానసిక వత్తిడిని తగ్గించుకోవచ్చని, క్యాన్సర్ వంటి మానసిన ఒత్తిళ్లను తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి రోజు కనీసం అరగంట సేపు సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలుడు, ఉమా మహేశ్వరరావు, రామాంజనేయులు, హెచ్‌ఎం భారతీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

పొన్నలూరు: రోజూ క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చని డాక్టర్ ఉన్నం కీర్తి పేర్కొన్నారు. మెగా హెల్త్ మేళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఆరోగ్య సూత్రాలు, క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కీర్తి మాట్లాడుతూ.. రోజూ సైక్లింగ్, యోగా చేయడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ప్రధానంగా ఆహారపు అలవాట్లు మార్చుకుని ఎక్కువగా కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో శారీరక బరువును నియంత్రించవచ్చు

టంగుటూరు: సైక్లింగ్‌తో శారీరక బరువును నియంత్రించవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ బాలాజీ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆరోగ్య మేళాలో భాగంగా టంగుటూరులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజూ సైక్లింగ్ చేస్తే రక్తపోటు, ఒత్తిడి తగ్గి ఉల్లాసంగా ఉండవచ్చన్నారు. క్యాన్సర్‌ను ఓడించడంలో సైక్లింగ్ సహాయ పడుతుందని, గుండె జబ్బులతో సంభవించే మరణాలను అరికడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్‌బాబు, సీహెచ్‌ఓ వెంకటేసులు, హెచ్‌వీబి పెంచులమ్మ, ఝాన్సీ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి


భూ సమస్యలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

లింగసముద్రం: ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న భూ సమస్యలపై తహసీల్దార్ సుధాకర్‌రావుతో చర్చించారు. మండలంలోని పెదపవని, ముత్యాలపాడు, మేదరమిట్లపాలెం, మొగిలిచర్ల, ఆర్‌ఆర్‌పాలెం తదితర గ్రామాల్లో ఎక్కువగా భూ సమస్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములు, కాలువ, వాగు పోరంబోకు భూములను గతంలో తహసీల్దార్లుగా పనిచేసిన వారు ఇష్టారాజ్యంగా ఎఫ్‌ఎల్‌ఆర్ రెవెన్యూ రికార్డుల్లో తారుమారు చేసి ఆన్‌లైన్ చేశారన్నారు. ముత్యాలపాడు రెవెన్యూలో రాజులు గిఫ్టుగా ఇచ్చిన భూమిని ఎట్టిమాన్యం కింద మార్చి పట్టాలు పొందారని ఈసీ చూస్తే రాజులు గిఫ్టుగా ఇచ్చిన వారమీదనే వస్తుందని, ఈ భూములను అన్యాక్రాంతం చేసి పట్టాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే మేదరమిట్లపాలెం పంచాయతీలోని జంగాలపల్లెలో శ్మశానం ఆక్రమణకు గురైందని, వెంటనే ఆక్రమణదారులను తొలగించి చర్యలు తీసుకోవాలన్నారు. మేదరమిట్లపాలెంలో వాగు, కాలువ పోరంబోకుగా ఉన్న భూమికి పట్టాలు సృష్టించారని, వీటిపై సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. లింగసముద్రం కెనరా బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శి మాధవరావును పిలిపించి గ్రామంలో పందుల సమస్య లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ సిబ్బంది సక్రమంగా పనిచేయాలని, గ్రామాల్లో ఆక్రమించిన ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలన్నారు. సక్రమంగా పనిచేయని వీఆర్‌ఓలు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రసేన్, ఆర్‌ఐ హనుమాయమ్మ, సర్పంచ్ పులి పెదరాఘవులు, రెవెన్యూ సిబ్బది పాల్గొన్నారు.

వివాదాలు తొలగించేందుకే రీ సర్వే


సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

పామూరు: భూముల సమగ్ర రీ సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు భూ యజమానులు సహకరించాలని తహసీల్దార్ బీఆర్‌ఎల్‌వీ ప్రసాద్ అన్నారు. మండలంలోని కరోళ్లపాడు రెవెన్యూ పరిధిలో చేపట్టనున్న సమగ్ర భూముల రీసర్వేలో భాగంగా మంగళవారం కరోళ్లపాడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ భూములకు సంబంధించి ఎలాంటి విభేదాలు, వివాదాలకు తావులేకుండా చేసి శాశ్వత భూమి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూముల రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆ దిశగా సర్వేను పారదర్శకంగా పూర్తిచేయాలని ఆదేశించారు. పొలాల్లో నిర్వహించనున్న సర్వే తీరుతెన్నులపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులు సమస్యలను ఆయన దృష్టికి తేగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ షాహిద్, సర్వేయర్ విలేజ్ సర్వేయర్ శివదుర్గ, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం: భూముల రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఏ బాలకిషోర్ అన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని కోమటిగుంట్ల రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను మంగళవారం పరిశీలించారు. పట్టా, అసైన్‌మెంట్, పోరంబోకు తదితర భూముల వివరాలను తెలుసుకున్నారు. రైతులు ఆధారాలను సర్వే అధికారులకు అందజేసి రీ సర్వే త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని రైతులను కోరారు. సర్వేయర్ అజయ్, విలేజ్ సర్వేయర్ జీవిత ఉన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం


బీమా నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: వైఎస్సార్ బీమా పేదల పాలిట వరం లాంటిదని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పట్టణంలోని పదో వార్డు పాతూరులో అనారోగ్యంతో మృతి చెందిన మట్టి మాలకొండయ్య కుటుంబ సంభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదు ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుని కుటుంబానికి ప్రభుత్వం తరపు నుంచి రావాల్సిన అన్ని రాయితీలను, సంక్షేమ పథకాలు అందచేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ దాసరి పద్మ, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ రంగనాయకులరెడ్డి, సచివాలయ కన్వీనర్లు దాసరి మురళీకృష్ణా, సయ్యద్ నాయబ్ రసూల్, మాజీ ఎంపీటీసీ జిలానీ, వెల్ఫేర్ అధికారి మధు, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఒబ్బిరెడ్డిపల్లిలో పొలంబడి

సీఎస్‌పురం: మండలంలోని డీజీపేట రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఒబ్బిరెడ్డిపల్లిలో వ్యవసాయశాఖాధికారులు మంగళవారం పొలంబడి నిర్వహించారు. గ్రామ పరిధిలో సాగు చేసిన జొన్న పంటను పరిశీలించారు. అనంతరం రామాలయం వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. మొవ్వతొలుచు పురుగు జీవిత చక్రం గురించి వివరించి పురుగును గుర్తించే విధానం, పురుగు వల్ల పంటకు కలిగే నష్టం, పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. మాజీ ఎంపీటీసీ మితికేల గురవయ్య, వీఏఏ అనూష, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల హాజరు పెంచండి


కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ పి.రామకృష్ణ సూచించారు. జరుగుమల్లి మండలం చింతలపాలెంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామంలో 6 పనులకు సంబంధించి 160 మంది కూలీలు పనిచేస్తున్నారన్నారు. కూలీలకు సూచనలిచ్చారు. ఆయన వెంట ఏపీఓ నాగరాజు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయండి

● సీఐ దాచేపల్లి రంగనాథ్


మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: నేరాల నియంత్రణకు పోలీసు సిబ్బంది కృషి చేయాలని సీఐ రంగనాథ్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం టంగుటూరు, జరుగుమల్లి, సింగరాయకొండ మండలాల ఎస్సైలు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్తగా అన్ని గ్రామాల్లో పెద్దల సహకారంతో 4కు తగ్గకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో క్రైం రేట్ తగ్గించేందుకు కృషి చేయాలని, పనితీరు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళా పోలీసులతో మాట్లాడుతూ.. గ్రామంలోకి కొత్తగా వచ్చేవారి వివరాలు తెలుసుకోవాలని, ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన టంగుటూరు ఎస్సై ఖాదర్‌భాషా, ఎస్పీ మలికా గర్గ్ నుంచి ప్రశంస పత్రాలు పొందిన సింగరాయకొండ మహిళా పోలీసులు పి.భారతి, షేక్ సల్మా, కె.నాగలక్ష్మి, టంగుటూరుకు చెందిన కె.విష్ణుప్రియను సీఐ అభినందించారు. ఎస్సైలు పి వెంకటేశ్వరరావు, షేక్ ఫిరోజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణతో ఆడదూడల జననం

● పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ రమేష్‌నాయక్


రాళ్లపాడులో మేలు జాతి దూడల ప్రదర్శనలో పశు వైద్యాధికారులు

లింగసముద్రం: కృత్రిమ గర్భణదారణతో మేలు జాతి ఆడదూడలను పుట్టించవచ్చని పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని రాళ్లపాడులో పశువైద్యాధికారి డాక్టర్ వైవీ కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేశీయ మేలు జాతి దూడల ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దూడలు పుట్టిన అరగంట లోగా ముర్రుపాలు తాగించాలన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వణాధికారి డాక్టర్ కాలేషా మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దూడల ప్రదర్శలో మేలు జాతి దూడలను గుర్తించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఉపసంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్‌రావు, వలేటివారిపాలెం సహాయ సంచాలకుడు డాక్టర్ బ్రహ్మయ్య, చినపవని పశువైద్యాధికారి సుబ్రమణ్యం, పారా వెటర్నరీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల సంఖ్య పెంచాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల సంఖ్య పెంచేందుకు కార్యకర్తలు, ఆయాలు కృషి చేయాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. జరుగుమల్లి మండల కేంద్రంలోని విజయనగరం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో 9 మంది చిన్నారులకుగాను ఏడుగురే ఉండటంపై కార్యకర్తను ప్రశ్నించారు. చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో నారాయణస్వామికి పూజలు


నారాయణస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సీఎస్‌పురం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణస్వామి ఆలయంలో ఈ నెల 12 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవాచనం, వేద పారాయణం, సుబ్రహ్మణ్య మూలమంత్ర, సర్ప సూక్త, మన్యుసూక్త హోమాలు, సాయంత్రం దీక్షా హవనం, సర్పసూక్త, మన్యు సూక్త పారాయణ చేపట్టారు. రాత్రికి శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి, నారాయణస్వామి వారలకు హనుమంతు వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాకుండా చూడాలి

పామూరు: ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ ఎక్కడా ఉల్లంఘన కాకుండా చూడాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసులు పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. ఎన్నికలకోడ్ అమలు, సంక్షేమ పథకాల అమలు తీరుతెన్నులపై మంగళవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశహాలులో ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నేతల విగ్రహాలకు పరదాలు కట్టించాలని, నాయకులు, వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఎక్కడైనా కోడ్ ఉల్లంఘన జరుగుతుంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇంటింటా వైద్యం–ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రియంవద అన్నారు. మండలంలోని పూరేటిపల్లిలో మంగళవారం నిర్వహించిన ఇంటింటా వైద్యం–ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో ప్రజలకు అందుతున్న వైద్యం గురించి వైద్యాధికారి మారుతీరావును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఇంటి ముంగిటే వచ్చి వెద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. అనంతరం గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రిజిష్టర్లు, మందుల స్టాకు రిజిష్టర్లు పరిశీలించారు. ఆమె వెంట వైద్యాధికారులు మారుతీరావు, సాయి ప్రియాంక, సీహెచ్‌ఓ భాస్కరరావు ఉన్నారు.

అమర జవాన్లకు నివాళులు


అమర జవాన్లుకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కందుకూరు రూరల్ : పుల్వామాలో జరిగిన దాడిలో అమరులైన జవాన్లకు స్థానిక టీఆర్‌ఆర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అద్యాపక బృందం మంగళవారం నివాళులర్పించారు. దేశ రక్షణలో జవాన్ల సేవలను వెలకట్టలేమన్నారు.

టెన్త్ విద్యార్థులకు అల్పాహారం

వెలిగండ్ల: మండలంలోని పి.నాగులవరం హైస్కూలులో పదో తరగతి చదువుతున్న 63 మంది విద్యార్థులకు కేసరి వెంకటరెడ్డి, ధనలక్ష్మి కుమారులు ప్రణీత్, ప్రతీక్ అల్పాహారం అందించారు. పరీక్షల దగ్గర పడుతుండటంతో సాయంత్రం సమయంలో ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం అల్పాహారం అందిస్తారన్నారు. గ్రామపెద్దలు కేసరి రామిరెడ్డి, సానికొమ్ము నారాయణరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అనంతవరం మాజీ సర్పంచ్ మృతి


కసుకుర్తి సుందరరావు, మాజీ సర్పంచ్

టంగుటూరు: మండలంలోని అనంతవరం గ్రామ వైఎస్సార్ సీపీ మాజీ సర్పంచ్ కసుకుర్తి సుందరరావు మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డిశ్చార్జి అయ్యి అక్కడే తన నివాసంలో ఉంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించి మంగళవారం మృతి చెందారు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. సుందరరావు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ కొండపి నియోజవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఫోన్లో పరామర్శించారు. అలాగే పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైఎస్సార్ టీఎఫ్ సభ్యులు సూదనగుంట వెంకటస్వామి, ఏఎంసీ డైరెక్టర్ టంగుటూరి రామకృష్ణ దుగ్గిరాల పేర్రాజు తదితరులు సుందరావుకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఐదుగురికి సెల్‌ఫోన్లు అందజేత


సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ రంగనాథ్, ఎస్సై ఖాదర్ బాషా

టంగుటూరు: టంగుటూరు మండలంలో ఐదుగురు వ్యక్తులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సింగరాయకొండలో సీఐ దాచేపల్లి రంగనాథ్ చేతుల మీదుగా మంగళవారం అందజేసినట్లు ఎస్సై ఖాదర్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. టంగుటూరుకు చెందిన ఎం.సతీష్, కె.సునీల్, రాయివారిపాలేనికి చెందిన ఎస్.మహేంద్రబాబు, కేసుపాలేనికి చెందిన కె.కోటిరెడ్డి, వెంకటాయపాలేనికి చెందిన బి.వెంకటేశ్వర్లు తమ ఫోన్లను పోగొట్టుకోగా సాంకేతికత సాయంతో గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు టంగుటూరు మండలంలో 65 మందికి సెల్‌ఫోన్లు అందజేశామన్నారు. అనంతరం టంగుటూరు–కొండపి రోడ్డులో జీబ్రా లైన్స్ అమర్చి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.